సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

గురువారం | 30 | జనవరి | 2025



పనుల్లో వేగం పెంచాలి

వరంగల్ నగరంలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనుల్లో వేగం పెంచాలని ఆర్అండ్‌బీ స్పెషల్ సెక్రటరీ వికాస్‌రాజ్ ఆదేశించారు. - 8లో▸



అభివృద్ధికి మార్గనిర్దేశం బాల వికాస

బాల వికాస సంస్థ మహిళల అభివృద్ధికి మార్గనిర్దేశంగా పనిచేస్తుందని ఎంపీ కావ్య, ఎమ్మెల్యే నాయిని అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం $31^0/17^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి చలి ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. రాత్రి సమయంలో చలితోపాటు పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

పింగిళిలో నేటినుంచి జాతీయ సదస్సు

హన్మకొండ అర్బన్ : హనుమకొండ వడ్డేపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాలలో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగాల ఆధ్వర్యంలో నేటి (గురువారం)నుంచి రెండు రోజులపాటు జాతీయ సదస్సు ప్రారంభం కానున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.చంద్రమౌళి తెలిపారు. బుధవారం ఆయన కాలేజీలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ 'ఫైనాన్షియల్ లిటరసీ అండ్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్ ఇన్ ఇండియా చాలెంజెస్ అండ్ ఆపర్చునిటీస్ 'అనే అంశంపై సదస్సు ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో సదస్సు ఆర్గనైజింగ్ సెక్రెటరీ జి.రాజు, సదస్సు కన్వీనర్, విభాగాధిపతి ఏ.సారంగపాణి పాల్గొన్నారు.

ఫోన్‌కాల్స్ నమ్మి మోసపోవద్దు : డీఎంహెచ్‌ఓ

ఎంజీఎం: వైద్య ఆరోగ్యశాఖలో రెగ్యులర్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ రాత పరీక్ష రాసిన అభ్యర్థులకు ఎన్‌హెచ్ఎం నుంచి మాట్లాడుతున్నామని ఫోన్‌కాల్స్ వస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అభ్యర్థులు ఎవరూ ఇలాంటి కాల్స్‌ను నమ్మి మోసపోవద్దని హనుమకొండ డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య సూచించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల రాష్ట్రస్థాయిలో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టుల పోస్టులకు రాత పరీక్ష నిర్వహించినట్లు పేర్కొన్నారు. దీనిని ఆసరాగా చేసుకొని కొందరు ఇలాంటి ఫేక్ కాల్స్ చేస్తున్నారని, వాటిని నమ్మి మోసపోవద్దని తెలిపారు. ఈ విషయాన్ని రాష్ట్ర ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఇలాంటి కాల్స్ వస్తే దగ్గర్లోని పోలీస్‌స్టేషన్, సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీనంబర్ 1930కి ఫిర్యాదు చేయాలని సూచించారు.

స్పెషల్ సీఎస్ వికాస్‌రాజ్‌ను కలిసిన కలెక్టర్లు



హన్మకొండ అర్బన్: టీజీ ట్రాన్స్‌పోర్ట్, ఆర్అండ్‌బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్‌ను హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారదలు మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించారు. బుధవారం హనుమకొండకు చేరుకున్న ఆయనను ఆర్అండ్‌బీ అతిథి గృహంలో వారు కలిసి కాసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్‌రెడ్డి, ఆర్డీఓ రమేష్ ఉన్నారు.


నేటినుంచి టీచర్లకు శిక్షణ

విద్యారణ్యపురి: కెరీర్ గైడెన్స్ కౌన్సెలింగ్‌పై జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్‌స్కూల్స్, తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలలనుంచి ఒక్కొక్కరికి 30, 31తేదీల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు హనుమకొండ డీఈఓ వాసంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రశాంత్‌నగర్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణకు హాజరుకావాల్సిన ఉపాధ్యాయుల జాబితాలను హెచ్ఎంలకు పంపామని, వారిని తప్పనిసరిగా పంపాలని ఆదేశించారు.

నేటినుంచి శైశిర నవరాత్రులు

హన్మకొండ కల్చరల్ : నగరంలోని భద్రకాళి దేవాలయంలో గురువారంనుంచి మాఘ మాసం పాడ్యమి తిథిని పురస్కరించుకుని మాఘ, శైశిర (గుప్త) నవరాత్రులు ప్రారంభమవుతాయని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిదిరోజుల పాటు జరిగే నవరాత్రుల్లో అమ్మవారికి భువనేశ్వరీ క్రమంలో ఆరాధన, షోడశీ చండీఆవరాణార్చనలు, అభిషేకాలు, హోమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

నృత్యకళాకారిణికి అభినందనలు



హన్మకొండ కల్చరల్ : హనుమకొండకు చెందిన సద్గురు శివానందన్యత్యమాల కళాక్షేత్రం నృత్యగురువు బొంపల్లి సుధీర్‌రావు శిష్యురాలు, కూచిపూడి నృత్య కళాకారిణి పెండ్యాల లక్ష్మీప్రియను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రముఖ సినీహీరో, మెగాస్టార్ చిరంజీవి అభినందించారు. గత మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన ఎక్స్‌పీరియం పార్క్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో లక్ష్మీప్రియ ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా వారు ప్రశంసించి అభినందనలు తెలిపారు.

నిరసనలు.. వాగ్వాదాలు

వాడీవేడిగా గ్రేటర్ వరంగల్ కౌన్సిల్ సమావేశం
- పేలిన మాటల తూటాలు
- పోడియం ముందు బైఠాయించిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు
- టౌన్‌ప్లానింగ్ అధికారులపై ఆగ్రహం



మేయర్ పోడియం ముందు ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు

వరంగల్ అర్బన్ : ప్లకార్డులతో నిరసన, విమర్శనాస్త్రాలు, వాగ్వాదాలు, పోడియం ముందు బైఠాయింపులతో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం మారుమోగింది. కొన్ని మాటల, తూటాలు పేలాయి. బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది లక్ష్యంగా చేసుకుని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశం కొనసాగుతుండగానే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ప్రకటనతో సమావేశం అర్థాంతరంగా ముగిసింది. బుధవారం గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయంలో మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. రూ.65.80కోట్ల అభివృద్ధి పనులకు, 23 ఎజెండాలోని అంశాలకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సమావేశంలో రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు పాల్గొనగా, వరంగల్ ఎంపీ కడియం కావ్య ఎక్స్‌అఫీషియో సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేశారు.

సభ ఆరంభంనుంచీ జగడమే

గ్రేటర్ పరిధిలోని 42 విలీన గ్రామాల్లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను రైతు కూలీలకు కల్పించడంపై తీర్మానం చేయాలని ప్రారంభంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఎజెండా అంశాలు పూర్తికాగానే చర్చిద్దామని మేయర్ సుధారాణి వారించారు. దీంతో వారు మేయర్ డౌన్‌డౌన్ అంటూ పోడియం ముందు బైఠాయించి నినాదాలు చేశారు. ఈలోగా ఎజెండాలోని అంశాలు పూర్తయ్యాక మాజీ ప్రధాని దివంగత మన్మోహన్ సింగ్ సంతాపం తీర్మానం పెట్టడంపై బీఆర్ఎస్ కార్పొరేటర్లు తప్పుపట్టారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు చొరవ తీసుకున్న వ్యక్తిని అవమానపరుస్తూ చివరగా తీర్మానం పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఆ తరువాత విలీన గ్రామాల్లో ఇందిరమ్మ ఆత్మీయ రైతు భరోసా ఇవ్వడంపై ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని తీర్మానించారు.

వాగ్వాదం

మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ విలీన గ్రామాల రైతులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంపై ప్రభుత్వానికి నివేదిస్తామని తెలపడం పట్ల ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్పొరేటర్లు తప్పుపట్టారు. ఈ అంశంపై మంత్రికి, ఎమ్మెల్సీకి మధ్య వాగ్వాదం జరిగింది. సమోసాలు, ఫొటోల కోసం బీఆర్ఎస్ కార్పొరేటర్లు రాద్ధాంతం చేస్తున్నారని ఎమ్మెల్యే నాయిని వ్యాఖ్యానించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మాటలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ బల్దియా సిటీ ప్లానర్ రవీందర్ వాడేకర్ ఏజే మిల్లు యూనియన్ బిల్డింగ్‌కు తప్పుడు పద్ధతిలో పర్మిషన్ ఇచ్చారని, ఫోన్ కూడా ఎత్తడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీకి ఫోన్ చేస్తే సమాధానం ఇస్తున్నారని, కానీ ఆఫ్టాల్ సిటీ ప్లానర్ ఎందుకు ఫోన్ ఎత్తడని, అలాంటి అధికారి ఇక్కడ ఎందుకంటూ ఊగిపోయారు. మేయర్ జోక్యం చేసుకోబోగా.. మీరేందుకు జోక్యం చేసుకుంటున్నారని ఎమ్మెల్సీ సారయ్యతోపాటు కార్పొరేటర్ గుండేటి నరేందర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. కమిషనర్ అశ్విని తానాజీ కలగచేసుకుని కోర్టు ఆదేశాల మేరకు అనుమతులిచ్చామని, మళ్లీ వచ్చిన ఆదేశాలతో రద్దు చేశామని, తదుపరి కోర్టు ఆదేశాలను పాటిస్తామని సమాధానం ఇచ్చారు. స్మార్ట్‌సిటీ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని బీజేపీ కార్పొరేటర్ చాడ స్వాతి పేర్కొన్నారు. మడికొండ డంపింగ్ యార్డు, అక్రమ భవన నిర్మాణాలు తదితర అంశాలపై అభినవ భాస్కర్, మరికొందరు కార్పొరేటర్లు ప్రస్తావించారు.



మాజీ డిప్యూటీ మేయర్ ఎంబాడి రవీందర్ మృతికి సంతాపం తెలుపుతున్న కౌన్సిల్ సభ్యులు

నగరాభివృద్ధికి రూ. 6,100కోట్లు : మంత్రి కొండా సురేఖ



నగరాభివృద్ధికి ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.6,100 కోట్ల నిధులు మంజూరు చేసింది. నగర చరిత్రలో ఇదో సువర్ణ అధ్యాయం. పెండింగ్‌లో ఉన్న రూ.187కోట్లను సీఎం మంజూరు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన తర్వాత నగరం రూపురేఖలు మారిపోయాయి.

అన్నీ డివిజన్ల ప్రాధాన్యం : మేయర్ సుధారాణి



నగరంలోని అన్ని డివిజన్లకు సమాన ప్రాధాన్యత కల్పిస్తూ నిధులు కేటాయిస్తున్నాం. ప్రతిపక్షం అనే వివక్ష చూపడం లేదు. సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ నగరంపై ప్రత్యేక అభిమానాన్ని చూపిస్తున్నారు. రాజకీయాలకతీతంగా ముందుకు సాగుతాం.

మాజీ ఎమ్మెల్యే దందాలు మితిమీరాయి ఎమ్మెల్సీ సారయ్య



మాజీ ఎమ్మెల్యే భూ దందాలు పెద్దఎత్తున చేశారు. చివరికి ఓరుగల్లు ప్రజలు కల అయిన ఏజే మిల్లు యూనియన్ భవనాన్ని కూల్చివేయించారు. బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారులు కమర్షియల్ బిల్డింగ్‌కు పర్మిషన్ ఇచ్చారు. వారిపై చర్యలు తీసుకోవాలి. ప్రజలు, సంఘాల నుంచి పెద్దఎత్తున నిరసనలు వ్యక్తమవుతున్నాయి. సీఎం దృష్టికి తీసుకెళ్తా.

మా వల్లే మేయర్ పదవి ఎమ్మెల్సీ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



బీఆర్ఎస్ పార్టీనుంచి కార్పొరేటర్ టికెట్ ఇస్తే గెలిచి, మేయర్‌గా ఎన్నికై మా పార్టీ కార్పొరేటర్లకు అన్యాయం చేయడం తగదు. మేయర్ నిర్ణయాలు, వివక్ష సరికాదు. పద్ధతి మార్చుకోవాలి. తెలంగాణ ఇచ్చిన మాజీ పీఎం మన్మోహన్ సింగ్ సంతాప తీర్మానాన్ని చివరికి చెప్పడం బాధకరం.



ఎక్స్‌అఫీషియో సభ్యురాలిగా ప్రమాణస్వీకారం చేస్తున్న ఎంపీ కావ్య


ప్రజలు గుణపాఠం చెప్పినా బుద్ధి రాలేదు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



బీఆర్ఎస్‌కు రాష్ట్ర ప్రజ లు బుద్ధి చెప్పినా ఇంకా ఆ పార్టీ వారికి బుద్ధి రావడం లేదు. ప్రచారం కోసం రాద్ధాంతం చేస్తున్నారు. ప్రజలు వారిని ప్రజాప్రతినిధులుగా ఎన్నుకున్నారు. వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి.

- ఉపాధ్యాయ 'ఎమ్మెల్సీ' షెడ్యూల్ విడుదల

మోగిన ఎన్నికల నగారా..



- ఫిబ్రవరి 3న నోటిఫికేషన్.. అదేరోజు నుంచి 10 వరకు నామినేషన్లు
- 11న నామినేషన్ల పరిశీలన.. 13న ఉప సంహరణ...
- 27న పోలింగ్... మార్చి 3న ఓట్ల లెక్కింపు... ఫలితాలు
- ఇప్పటికే ప్రచారం మొదలెట్టిన ఆశావహులు

సాక్షిప్రతినిధి, వరంగల్:

ఎప్పుడెప్పుడాని ఎదురుచూస్తున్న వరంగల్–నల్లగొండ–ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికల నగారా మోగింది. ఈ మేరకు భారత ఎన్నికల కమిషన్ బుధవారం షెడ్యూల్ ప్రకటించింది. ఎమ్మెల్సీగా ఉన్న అలుగుబెల్లి నర్సిరెడ్డి పదవీకాలం మార్చి 29న ముగియనుంది. ఇప్పటికే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల జాబితాను సిద్ధం చేయగా.. ఎమ్మెల్సీ రేసులో ఉన్న ఆశావహులు ప్రచారం సాగిస్తున్నారు.

వచ్చే నెల 3న నోటిఫికేషన్... అమల్లోకి ఎన్నికల కోడ్...

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం వచ్చే నెల 3న నోటిఫికేషన్ విడుదల కానుంది. అదే రోజు నుంచి అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేయాల్సి ఉండగా.. 10వ తేదీ వరకు గడువు ఉంటుంది. ఆ రోజు వరకు దాఖలైన నామినేషన్‌లను ఎన్నికల అధికారులు 11న పరిశీలించనుండగా, 13న నామినేషన్‌ల ఉపసంహరణ తర్వాత బరిలో ఉన్న అభ్యర్థుల పేర్లను వెల్లడిస్తారు. నామినేషన్ల ఉపసంహరణ.. పోలింగ్‌కు మధ్య సుమారు 14 రోజుల సమయం ఉండనుండగా, ఒక్కరోజు ముందే ప్రచారాన్ని ముగించాల్సి ఉంటుంది. ఈ మేరకు అభ్యర్థులు ప్లాన్ చేసుకోవాల్సి ఉండగా.. 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుంది. మార్చి 3న ఓట్లు లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నట్లు ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌లో పేర్కొంది. బుధవారంనుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని వెల్లడించడంతో పలు అధికారిక కార్యక్రమాలు వాయిదా పడ్డాయి.

12 జిల్లాలు, 24,905 మంది ఓటర్లు...

వరంగల్ – నల్లగొండ – ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా 12 జిల్లాలు, 191 మండలాలకు చెందిన 24,905 మంది ఉపాధ్యాయులు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఇందుకోసం 200 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు ఇదివరకే ప్రకటించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ కోసం అధికార యంత్రాంగం సర్వసన్నద్ధమైంది. ఈ నియోజకవర్గం నుంచి ప్రస్తుతం టీఎస్‌యూటీఎఫ్ నేత అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయనకు ముందు పూల రవీందర్, చుక్కా రామయ్యలు ఎమ్మెల్సీలుగా ప్రాతినిధ్యం వహించారు. ఈసారి ఎన్నికల్లో నర్సిరెడ్డి మరోసారి బరిలో నిలవనుండగా ఇండిపెండెంట్‌గా 'కుడా' మాజీ చైర్మన్ ఎస్.సుందర్‌రాజు, వివిధ ఉపాధ్యాయసంఘాల నుంచి పులి సరోత్తమరెడ్డి, పింగిళి శ్రీపాల్‌రెడ్డి, పూల రవీందర్, గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, సాయిరెడ్డి, కస్తూరి సాయిచరణ్‌తో పాటు పలువురు ప్రచారం మొదలెట్టారు.

వరంగల్-ఖమ్మం-నల్లగొండ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలు, ఓటర్లు మొత్తం వివరాలు

మండలాలు **191**

పోలింగ్ కేంద్రాలు **200**

పురుషులు **14,940**

మహిళలు **9,995**



వరంగల్ -ఖమ్మం-నల్లగొండ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల సంఖ్య...

జిల్లా	మండలాలు	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	మొత్తం
సిద్దిపేట	04	04	120	43	163
జనగామ	12	12	556	365	921
హనుమకొండ	11	15	2884	2214	5098
వరంగల్	13	13	1381	844	2225
మహబూబాబాద్	18	16	1083	535	1618
భూపాలపల్లి	07	07	211	112	323
ములుగు	09	09	394	218	612
భద్రాద్రి	23	23	1038	941	1949
ఖమ్మం	21	24	2300	1655	3955
యాదాద్రి	17	17	595	326	921
సూర్యాపేట	23	23	1690	947	2637
నల్లగొండ	33	37	2688	1795	4483

గ్రామాల్లో ప్లాస్టిక్ సేకరించాలి

వరంగల్ కలెక్టర్ సత్యశారద

వరంగల్: జిల్లాలోని మండలాలు, గ్రామాల్లో ప్లాస్టిక్ సేకరణ ప్రక్రియ చేపట్టాలని వరంగల్ కలెక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలపై బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. గణేశ్ ఏకోటెక్ వైస్ ప్రెసిడెంట్ కేఎస్.రెడ్డి మాట్లాడుతూ వన్ టైం యూజ్ ప్లాస్టిక్ సేకరించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్కుకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరగా ఆర్టీసీ ఆర్ఎంకు ప్రతిపాదనలు పెట్టాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్ అనూజ్ అగర్వాల్, అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ సంగీతలక్ష్మి పాల్గొన్నారు.



అభివృద్ధి పనులపై సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు..

జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో డీసీపీ రవీందర్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో మత్తు పదార్థాల నియంత్రణపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యాసంస్థల సమీపంలో 100 మీటర్ల మేరకు ఎలాంటి కిరాణా షాపులు ఉండకూడదనే నిబంధనను పాటించాలని పోలీసు అధికారులకు సూచించారు.

వసతి గృహ భవనం పరిశీలన..

దేశాయిపేట: వరంగల్ దేశాయిపేటలోని శివాలయం వద్ద రూ.4 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ప్రభుత్వ ఉద్యోగినుల వసతి భవనాన్ని బుధవారం కలెక్టర్ సత్యశారద క్షేత్రస్థాయిలో పరిశీలించారు. త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

చట్టాలపై అవగాహన ఎంతో ఉపయోగం

చాంబర్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

వరంగల్: చట్టాలపై అవగాహన వ్యాపారులకు ఎంతో ఉపయోగమని చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి అన్నారు. వరంగల్‌లోని ఓ హోటల్‌లో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఇలాంటి అవగాహన సదస్సులను చాంబర్‌లో ఏర్పాటు చేసేందుకు సహకారం అందిస్తామని తెలిపారు. ఆదాయ పన్ను అధికారి కేపీసీ.శేఖర్ మాట్లాడుతూ ఐటీ రిటర్న్స్ సమర్పించిన అనంతరం పరిశీలించిన అధికారులు కొన్ని అంశాలపై వివరణ కోరుతారని, తక్షణమే స్పందించి సమర్పించాలని సూచించారు. తప్పుడు సమాచారంతో ఆలస్యం చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సదస్సులో ఐటీ అధికారులు, ట్యాక్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు త్రిపురనేని గోపీచంద్, రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తోట సంపత్‌కుమార్, చాంబర్ ప్రతినిధులు చంద్రమౌళి, అల్లె సంపత్, హరినాథ్, శ్రీనివాస్, కాటన్, చిల్లీస్, కోల్డ్ స్టోరేజీ సెక్షన్ల అధ్యక్షులు చింతలపల్లి వీరారావు, రాజేశ్ డి.కరానీ, పూనాటి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చాంబర్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

రుద్రేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝూ

హన్మకొండ కల్చరల్ : వేయిస్తంభాల దేవాలయంలో బుధవారం పుష్యమాసం మౌని అమావాస్యను పురస్కరించుకుని శ్రీరుద్రేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రభాతసేవ, గణపతిపూజ, రుద్రేశ్వరస్వామి వారికి అఘోర పాశుపత రుద్రాభిషేకం జరిపారు. సాయంత్రం జరిగిన ప్రదోషకాల పూజల్లో నగర సీపీ అంబర్ కిశోర్ ఝూ కుటుంబ సమేతంగా దేవాలయాన్ని సందర్శించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

సకాలంలో పనులు పూర్తిచేయాలి

హన్మకొండ: సమ్మర్ యాక్షన్ ప్లాన్ మేరకు సకాలంలో పనులు పూర్తి చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్, హనుమకొండ సర్కిల్ నోడల్ ఆఫీసర్లు ఎ.రాజుచౌహాన్, టి.మధుసూదన్ అధికారులను ఆదేశించారు. హనుమకొండ పెద్దమ్మగడ్డ, నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ఆయా జిల్లాల సర్కిల్ కార్యాలయాల్లో సమ్మర్ యాక్షన్‌ప్లాన్‌పై బుధవారం వారు వేర్వేరుగా సమీక్ష నిర్వహించారు. విద్యుత్ డిమాండ్, యాక్షన్ ప్లాన్‌లో పేర్కొన్న మేరకు పూర్తయిన, కొనసాగుతున్నవి, ప్రారంభించని పనులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేసవిలో పెరిగే డిమాండ్‌కు అనుగుణంగా వినియోగదారులకు నాణ్యమైన, మెరుగైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. ఆయా సమావేశంలో సూపరింటెండెంట్లు, ఎస్ఈలు పాల్గొన్నారు.

వేగం కన్నా ప్రాణం ముఖ్యం

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్ : వేగం కన్నా ప్రాణం ముఖ్యమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో గ్రామీణ వలంటీర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ట్రాఫిక్ నిబంధనల అవగాహనాలోపం కారణంగా ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వీటిని తగ్గించేందుకు నెహ్రూ యువ కేంద్రం, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, రవాణా, పోలీస్ శాఖల సహకారంతో ఈనెల 17 నుంచి 31 వరకు రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపకూడదని, కారులో ప్రయాణించేటప్పుడు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్, రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ పుప్పాల శ్రీనివాస్, ట్రాఫిక్ ఏసీపీ ముప్పాల శ్రీనివాస్, ఏపీడీ సుధీర్, జిల్లా ట్రెజరీ అధికారి శ్రీనివాసరావు, సీఐ సీతారెడ్డి, నేషనల్ యూత్ అవార్డు గ్రహీత ఆకలపల్లి మధు, జేడీఎం శ్రీనివాస్, ఎస్సై రామారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య



కదం తొక్కిన ఎర్రదండు

సీపీఐ శతజయంతి ఉత్సవాల సందర్భంగా బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిలా పార్క్‌నుంచి నక్కలగుట్ట హరిత కాకతీయ హోటల్ వరకు భారీ ర్యాలీ తీశారు. ప్రజానాట్య మండలి కళాకారుల ఆటపాటలు, పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, శ్రేణులు ఎర్రజెండాలు చేతబూని ర్యాలీలో పాల్గొన్నారు. - హనుమకొండ - 8లో▸

జక్రియాను ప్రశ్నించి.. వదిలేశారు

సాక్షి, వరంగల్: వరంగల్‌కు చెందిన జమాత్–ఉల్–ముస్లిమీన్ ఆల్ ఇండియా ప్రెసిడెంట్ జక్రియాను చెన్నై ఇమ్మిగ్రేషన్ అధికారులు విమానాశ్రయంలో అదుపులోకి తీసుకొని విచారించడం కలకలం సృష్టించింది. పాకిస్థాన్‌లోని కరాచీ కేంద్రంగా ఉన్న సంస్థకు ఆయన పనిచేస్తున్నారు. 15 మంది సభ్యులతో జమాత్ కోసం శ్రీలంకకు వెళ్లి వస్తుంటే అనుమానం వచ్చి ప్రశ్నించినట్లు తెలిసింది. అతని వద్ద బైత్ ఫామ్ (తమ వర్గంలో ఇతర వర్గానికి చెందిన ముస్లింలు చేరుతున్నట్లు దస్తంపై సంతకాలు)లు లభించడంతో అనుమానం వచ్చిన అధికారులు లోతుగా విచారించి వదిలేసినట్లు సమాచారం. ఈ విషయమై వరంగల్ పోలీసులను సంప్రదిస్తే తమకు చెన్నై అధికారుల నుంచి జక్రియాకు సంబంధించి ఎటువంటి సమాచారం రాలేదని బదులిచ్చారు. వరంగల్‌లో ఉగ్ర మూలాలు ఉన్నాయంటూ సామాజిక మాధ్యమాల్లో జరిగిన ప్రచారం అంతా వట్టిదేనని కొట్టిపారేశారు. ఇదిలా ఉండగా జమాత్–ఉల్–ముస్లిమీన్‌కు సంబంధించిన ప్రధాన కార్యాలయం జహీరాబాద్‌లో ఉంది. తాండూరు, హైదరాబాద్, వరంగల్, రంగారెడ్డి తదితర ప్రాంతాల్లో ఈ సంస్థ సభ్యులు ఉన్నారు. దీనిపై భారత్‌లో ఎటువంటి నిషేధం లేదు.

ఆస్పత్రి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

- ఆర్అండ్‌బీ స్పెషల్ సీఎస్ వికాస్‌రాజ్



సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి పనులను పరిశీలిస్తున్న వికాస్‌రాజ్

ఎంజీఎం: వరంగల్‌లోని నిర్మాణం అవుతున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని రాష్ట్ర అర్అండ్‌బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టర్ సత్యశారదతో కలిసి ఆస్పత్రి నిర్మాణ పనులు పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ సంబంధిత అంశాలపై అధికారులతో సమీక్షించారు. 2021లో చేపట్టిన భవన నిర్మాణ పనులు ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయి. ఇంకా ఏయే పనులు పెండింగ్‌లో ఉన్నయనే దానిపై అధికారులతో అడిగి తెలుసుకున్నారు. మొత్తం 56 ఎకరాల్లో 24 అంతస్తుల్లో నిర్మాణం అవుతున్న ఈ భవన నిర్మాణ పనులు పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో అర్అండ్‌బీ ఎస్ఈ రాజేశ్వర్‌రావు, సీఈ నాగేంద్ర నాథ్, డీఈ జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

భద్రకాళి దేవాలయంలో పూజలు

హన్మకొండ కల్చరల్ : భద్రకాళి దేవాలయాన్ని బుధవారం గవర్నమెంట్ ఆర్అండ్‌బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్ సందర్శించి అమ్మవారికి పూజలు చేశారు. అదేవిధంగా దేవాదాయ ధర్మాదాయశాఖ స్థపతి వల్లినాయగం, అసిస్టెంట్ స్థపతి గణేష్ దేవాలయాన్ని సందర్శించారు. మాడవీధుల నిర్మాణంలో భాగంగా దేవాలయం నాలుగువైపులా నిర్మించనున్న రాజగోపురాల ప్రణాళికలు పరిశీలించి కొలత తీసుకున్నారు.

ములుగు సర్కిల్‌కు మోక్షమెప్పుడు



ములుగు జిల్లా అయినా ఇంకా ఏర్పాటు కానీ విద్యుత్ సర్కిల్

- జిల్లాల పునర్విభజనతో టీజీ ఎన్పీడీసీఎల్‌లో కొత్త సర్కిళ్ల ఏర్పాటు
- జయశంకర్ భూపాలపల్లి సర్కిల్‌లోనే ములుగు జిల్లా కొనసాగింపు..
- కొత్త సర్కిల్ ఏర్పాటునకు అడ్డంకిగా మారిన పోస్టులు
- ప్రభుత్వం మంజూరు చేస్తేనే లైన్‌క్లియర్..



హన్మకొండ: ములుగు విద్యుత్ సర్కిల్ ఏర్పాటునకు ఇంకా మోక్షం కలగడం లేదు. రాష్ట్రంలో జిల్లాల పునర్విభజనతో అన్ని శాఖల జిల్లా కార్యాలయాలు నూతన జిల్లాల ప్రాతిపదికన ఏర్పాటయ్యాయి. జిల్లాల పునర్విభజన జరిగిన క్రమంలో ముందు ములుగు జిల్లా ప్రాంతం కలుపుకుని జయశంకర్ భూపాలపల్లి జిల్లాను ఏర్పాటు చేశారు. అయితే ములుగు ప్రాంత ప్రజల పోరాటంతో ప్రభుత్వం ములుగును జిల్లాగా ఏర్పాటు చేసింది. అప్పటికే నూతన జిల్లాల ప్రాతిపదికన జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలో ఎన్పీడీసీఎల్ సర్కిల్ ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ములుగు జిల్లా ఆవిర్భవించినా భూపాలపల్లి సర్కిల్‌లోనే కొనసాగిస్తున్నారు. దీంతో ములుగు విద్యుత్ సర్కిల్ కార్యాలయం ఏర్పాటు ఎప్పుడెప్పుడా అని ఆ జిల్లా విద్యుత్ వినియోగదారులు ఎదురుచూస్తున్నారు. సర్కిల్ మంజూరు చేయాలంటే నూతన పోస్టులు అవసరం. అధికారులు, ఉద్యోగులు రావాలంటే ప్రభుత్వం కొత్త పోస్టులు మంజూరు చేస్తేనే సాధ్యం. ఇది సర్కిల్ ఏర్పాటునకు ప్రతిబంధకంగా మారింది. కాగా, ఎన్పీడీసీఎల్ పరిధిలో ప్రస్తుతం 17 జిల్లాలు, 16 సర్కిళ్లు ఉన్నాయి.

అదనపు పోస్టులు మంజూరు చేస్తేనే సర్కిల్ ఏర్పాటు సాధ్యం..

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం.. ములుగు నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహిస్తున్న ధనసరి అనసూయ సీతక్క కేబినెట్ మంత్రి కావడంతో ఆమె సర్కిల్ ఏర్పాటుపై దృష్టి సారించింది. టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యాన్ని ములుగు సర్కిల్ ఏర్పాటు చేయాలని కోరారు. అయితే అదనపు పోస్టులు అవసరం కావడంతో సర్కిల్ ఏర్పాటు సాధ్యపడడం లేదు. రాష్ట్ర మంత్రిగా సీతక్క ఉండడం, సీఎం రేవంత్ రెడ్డికి సన్నిహితురాలు కావడంతో ప్రభుత్వం నుంచి పోస్టులు మంజూరు చేయించుకుంటారని ఆశించారు. ములుగు సర్కిల్‌తో పాటు జిల్లాలో ఏర్పాటు చేయాల్సిన అదనపు డివిజన్లు, అసిస్టెంట్ సబ్ డివిజనల్ కార్యాలయాల ఏర్పాటుకు అవసరమైన అదనపు పోస్టులు మంజూరు చేస్తేనే వీటి ఏర్పాటు జరుగుతుందని విద్యుత్ అధికారులు తెలిపారు. అయితే రాష్ట్ర మంత్రివర్గంలో కీలక మంత్రిగా ఉన్నా ప్రభుత్వం నుంచి పోస్టులు మంజూరు చేయించుకోవడంలో మంత్రి సీతక్క విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పోస్టులు మంజూరు లేకపోవడంతో ములుగు సర్కిల్‌లో ఏర్పాటులో జాప్యం జరుగుతోంది.

సర్కిల్‌తోపాటు డివిజన్లు, సబ్‌డివిజన్ల ఏర్పాటుకు నిర్ణయం

ములుగులో ఇప్పటికే ములుగు డివిజన్ ఉండగా సర్కిల్ కార్యాలయంతో పాటు కొత్తగా ఏటూరు నాగారం, కాటారం డివిజన్లు, మరో రెండు సబ్ డివిజన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యాలయాల నిర్వహణకు సూపరింటెండెంట్ ఇంజనీర్, డివిజనల్ ఇంజనీర్లు, ఏడీఈలు, ఏఈలు, సబ్ ఇంజనీర్లు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్‌లు, వాచ్‌మెన్, స్వీపర్లు అవసరం. ఈ పోస్టులు మంజూరైతేనే నూతన సర్కిళ్లు, డివిజన్లు, సబ్ డివిజన్లు ఏర్పాటు సాధ్యమవుతాయి. అప్పటి వరకూ కాలయాపన తప్పని పరిస్థితి.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు..

ఎలాగైనా ములుగు సర్కిల్ ఏర్పాటు చేయాలని మంత్రి సీతక్క.. టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యంపై ఒత్తిడి పెంచారు. దీంతో యాజమాన్యం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. ఈ నేపథ్యంలో కొన్నేళ్లుగా వృథాగా ఉంటున్న అన్‌యూజ్డ్ పోస్టులను ఇతర పోస్టులుగా కన్వర్షన్ చేయాలని ఉద్యోగ సంఘాల నుంచి డిమాండ్ వచ్చింది. దీంతో యాజమాన్యం అన్ యూజ్డ్ పోస్టులను కన్వర్షన్ చేస్తూ ములుగు జిల్లాకు అవసరమైన ఎస్ఈ, డీఈ, ఏడీఈ, ఏఓ, జేఏఓ, ఆఫీస్ సబార్డినేట్, వర్క్‌మెన్‌తో పాటు ఇతర పోస్టులు మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ పోస్టులు మంజూరైతేనే ములుగు సర్కిల్ ఏర్పాటుకు మార్గం సుగమమవుతోంది. ఈ దిశగా మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ చూపుతేనే త్వరగా కార్యరూపం దాల్చుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

చనిపోతూ చూపునిచ్చాడు..!

- గుండెపోటుతో వ్యక్తి మృతి
- నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులు



సర్టిఫికెట్ అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

మడికొండ: తాను చనిపోయి కూడా మరో ఇద్దరికి చూపునిచ్చాడు.. నిగ్గుల సాంబయ్య(70). కాజీపేట మండలం మడికొండ గ్రామానికి చెందిన సాంబయ్య గుండెపోటుతో బుధవారం ఉదయం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు పుట్టెడు దుఃఖంలో ఉండి కూడా సమాజ హితం కోరి నేత్రదానం చేయడానికి ముందుకొచ్చారు. దీంతో తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రాంతీయ నేత్ర వైద్యశాల వరంగల్ టెక్నీషియన్ ప్రదీప్ ద్వారా నేత్ర కార్నియా సేకరించారు. సాంబయ్య నేత్రదానంతో ఇద్దరికి చూపునిచ్చారని కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపి నేత్రదాన సర్టిఫికెట్ అందజేశారు. నేత్రదానం చేయాలనుకునే వారు 87905 48706, 99080 88011లో సంప్రదించాల్సిందిగా అసోసియేషన్ ప్రతినిధి కోస్‌రెడ్డి మల్లారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అడ్వైజర్ రవీందర్, అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఈఎంటీ కర్ణాకర్‌కు పురస్కారం



కర్ణాకర్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న శివకుమార్

ఖిలా వరంగల్ : వరంగల్ జిల్లా 108 వాహన స్టార్ ఈఎంటీ జక్కని కర్ణాకర్ సేవలను హైదరాబాద్‌లోని గ్రీన్ హెల్త్ సర్వీస్ గుర్తించి అవార్డు ప్రకటించింది. ఈమేరకు బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లా ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్‌సర్వీస్ ప్రోగ్రాం మేనేజర్ పాటి శివకుమార్.. కర్ణాకర్‌కు పురస్కారం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సూపర్‌వైజర్ రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు

నేషనల్ పీజియన్ షోలో వరంగల్‌కు బహుమతులు



ట్రోఫీ అందుకుంటున్న సయ్యద్ షాకీర్

వరంగల్ స్పోర్ట్స్: యునైటెడ్ పీజియన్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 25, 26వ తేదీల్లో కేరళ రాష్ట్రం త్రిశూర్‌లో నిర్వహించిన నేషనల్ పీజియన్ ప్రదర్శనలో కాజీపేటకు చెందిన సయ్యద్ షాకీర్ పావురాలు పలు పతకాలను సాధించాయి. దేశంలోని వివిధ రాష్ట్రాలనుంచి 800 పావురాలు పాల్గొన్న ఈ ప్రదర్శనలో మేల్ కేటగిరీలో షాకీర్ పావురం లాహోరీ మొదటి, రెండు స్థానాల్లో బహుమతులు గెలుచుకోగా, హంగేరియన్ గెయింట్ పీజియన్ కేటగిరీలో రెండు ,మూడు స్థానాల్లో విజయం సాధించింది. అంతేకాకుండా ఓవరాల్‌చాంపియన్ షిప్‌లో రెండు, మూడవ స్థానాల్లో నిలవడం విశేషం. అంతర్జాతీయ న్యాయనిర్ణేతలు జుహేరా జీ, మైక్‌ఓస్, సయ్యద్ అల్‌జబల్, నాసర్‌అల్ హిందీ చేతుల మీదుగా పావురాల యజమాని సయ్యద్ షాకీర్ బహుమతులు అందుకున్నాడు.

మట్టిలో బయటపడిన ప్రాణవట్టం



బయటపడిన శివలింగం ప్రాణవట్టాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, స్థానికులు

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ సమీపంలోని అగర్త చెరువు వద్ద మిల్స్‌కాలనీ పోలీసులు పోసిన మొరం మట్టిలో బుధవారం మధ్యాహ్నం శివలింగం (ప్రాణవట్టం) బయటపడింది. విషయం తెలిసిన స్థానిక భక్తులు, పోలీసులు అక్కడికి చేరుకుని శివలింగం(ప్రాణవట్టం) పరిశీలించారు. కాకతీయుల నాటి శివలింగంగా గుర్తించారు. కేంద్ర, రాష్ట్ర పురావస్తుశాఖ అధికారులు స్పందించి ఖిలావరంగల్ మధ్య కోటకు తరలించాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

అభివృద్ధికి మార్గనిర్దేశం 'బాలవికాస'

- ఎంపీ కావ్య, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి
- కాజీపేటలో బాలవికాస రాష్ట్ర మహిళా మహాసభ



కార్యక్రమానికి హాజరైన ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, తదితరులు

కాజీపేట రూరల్: సమాజంలో మహిళల అభివృద్ధికి మార్గనిర్దేశంగా నిలుస్తున్న బాలవికాస సేవలు ఆదర్శనీయమని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. కాజీపేట ఫాతిమా నగర్ బాలవికాస ప్రాంగణంలో బుధవారం సుస్థిర వ్యాపార మహిళా వికాసం నినాదంతో రాష్ట్ర స్థాయి మహిళా మహాసభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీ కావ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళల ఆర్థికాభివృద్ధికి సహకరిస్తున్న బాలవికాసకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మహిళలు ఎక్కడ ఉండే అక్కడ సంతోషముంటుందని అన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళా సాధికారత సాధిస్తే ఆ కుటుంబం సంతోషంగా ఉంటుందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వపరంగా మహిళలను అభివృద్ధిచేయాలనే ఉద్దేశంతో అనేక కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. బాలవికాస వ్యవస్థాపకురాలు బాలతెరిసా జింగ్రాస్ కెనడా నుంచి ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ బాలవికాస గొప్ప లక్ష్యంతో మహిళా సాధికారత కార్యక్రమాన్ని 32 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాలవికాస ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి మాట్లాడతూ ప్రతి మహిళలను లక్షాధికారిని చేయడమే బాలవికాస ధ్యేయమని అన్నారు. బాలవికాస ఆధ్వర్యంలో మహిళలకు అన్ని రంగాల్లో ప్రత్యేక వ్యాపార శిక్షణకు హైదరాబాద్‌లో 20 ఎకరాల్లో సామాజిక వ్యాపార కేంద్రాన్ని నిర్మించామని అన్నారు. వ్యాపార రంగాల్లో రాణించిన నలుగురు మహిళలకు బాలవికాస మహిళా ఔత్సాహిక వ్యాపార సాఫల్య పురస్కారం –2024 బహుమతులు ప్రదానం చేశారు. అడిషనల్ డీఆర్‌డీఏ సుధీర్ మాట్లాడుతూ.. మహిళా వికాసానికి బాలవికాస చేస్తున్న కృషిని అభినందించారు. బాలవికాస మహిళా అభివృద్ధి పథక మేనేజర్ లత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీపీఎం అనిల్, డీఎంఎం రజిత, జనవికాస అధ్యక్షుడు లూర్ధుమర్రెడ్డి, బోర్డు మెంబర్ డాక్టర్ హరీశ్, డైరెక్టర్లు రాహుల్, సునితారెడ్డి, మేనేజర్లు ప్రతాప్‌రెడ్డి, ఫ్రాన్సిస్ రెడ్డి, తిరుపతి, మంజుల, శోభ, శివరాం, మధుసూదరెడ్డి, మోసెస్, విజేందర్ పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌కు 53మంది గైర్హాజరు

విద్యారణ్యపురి: ప్రతిష్టాత్మక నిట్, ఐఐటీల్లో ఇంజనీరింగ్ ప్రవేశాలకు గురువారం హనుమకొండ, వరంగల్ కలిపి ఐదు పరీక్షా కేంద్రాల్లో జేఈఈ మెయిన్స్ పరీక్షలు జరిగాయి. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించిన మొదటి సెషన్‌కు 1,257మంది విద్యార్థులకు 1,230మంది హాజరుకాగా 27మంది గైర్హాజరయ్యారు. రెండో సెషన్‌లో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు జరిగిన పరీక్షలో 1,198మంది విద్యార్థులకు 1,178మంది హాజరు కాగా 26మంది గైర్హాజరయ్యారు. రెండు సెషన్లు కలిపి మొత్తంగా 53మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని సిటీ కోఆర్డినేటర్ శ్రీలతారెడ్డి తెలిపారు.

ప్రజల పక్షాన సీపీఐ పోరాటం



ర్యాలీలో కళాకారుల ఆటపాట



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

- ప్రభుత్వం హామీలు అమలు చేయాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి

హన్మకొండ: ప్రజల పక్షాన సీపీఐ పోరాటం చేస్తుందని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండలో సీపీఐ శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిలాపార్క్ నుంచి నక్కలగుట్టలోని హరిత కాకతీయ వరకు ప్రజానాట్య మండలి ఆటపాటలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం హరిత కాకతీయ హోటల్‌లో జరిగిన సమావేశంలో చాడ వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. సీపీఐ 1925 డిసెంబర్ 26న ఉత్తర ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో స్థాపించారన్నారు. రాచరికపాలన సాగుతోన్న ఆ కాలంలో అప్పటికే ఉన్న కాంగ్రెస్ సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం పోరాడడం లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కమ్యూనిస్టులను అంతం చేయాలనే దురాలోచన చేస్తుందని, ప్రజల పక్షాన నిత్యం పోరాటాలు నిర్వహించే కమ్యూనిస్టులకు అంతం లేదన్నారు. కమ్యూనిస్టులు, నక్సలైట్లను అంతం చేయడం బీజేపీ వల్ల కాదన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. జిల్లాలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు, పేదల కాలనీల్లో మౌలిక వసతులు వచ్చేంతవరకు పోరాట స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, నాయకులు సిరబోయిన కరుణాకర్, ఆదరి శ్రీనివాస్, మంద సదాలక్ష్మి, పంజాల రమేష్, తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, కర్రె లక్ష్మణ్, భిక్షపతి, బాషబోయిన సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అధికార లాంఛనాలతో వంశీ అంత్యక్రియలు



వంశీ కృష్ణ మృతదేహానికి గౌరవ వందనం చేస్తున్న నేవీ సిబ్బంది, పోలీసులు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

- మృతదేహంపై జాతీయ జెండా కప్పి సెల్యూట్
- నివాళులర్పించిన ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి: గుజరాత్ రాష్ట్రం పోరుబందర్‌లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నౌకాదళ అధికారి (ప్రధాన్ యాంత్రిక్) ఆకుల వంశీ కృష్ణ(20) మృతదేహానికి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఐదుగురు నేవీ సిబ్బంది అహ్మదాబాద్ నుంచి వంశీ మృతదేహాన్ని హసన్‌పర్తికి తీసుకొచ్చారు. వంశీ కుటుంబ సభ్యులు రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. వంశీ మృతదేహంపై జాతీయ జెండా కప్పి సెల్యూట్ చేశారు. అనంతరం గౌరవ సూచకంగా గాలిలో మూడురౌండ్లు కాల్పులు జరిపారు. వంశీ కృష్ణ మృతదేహాన్ని స్థానిక ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుడి తండ్రి రాజేందర్‌ను ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కిరణ్, ఆరెల్లి వెంకటస్వామి, కాంగ్రెస్ నాయకులు పెద్దమ్మ నర్సింహారాములు, రవి, పుల్లా రవి తదితరులు ఉన్నారు. స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, చకిలం రాజేశ్వర్‌రావు తదితరులు నివాళులర్పించారు. వంశీ అంతిమ యాత్రలో వివిధ సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

భూ భారతితో ధరణి సమస్యల పరిష్కారం




సదస్సులో మాట్లాడుతున్న కోదండరెడ్డి

- వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి

పాలకుర్తిటౌన్: ధరణితో తలెత్తిన సమస్యలకు భూభారతితో పరిష్కారం లభించనుందని వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ రాష్ట్ర చైర్మన్ కోదండ రెడ్డి అన్నారు. లీఫ్స్ సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బృందావన్ గార్డెన్‌లో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి సదస్సుకు అధ్యక్షత వహించగా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, భూభారతి చట్ట రూపకర్త భూమి సునీల్‌కుమార్ పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన కోదండరెడ్డి మాట్లాడుతూ గత పదేళ్లలో కేసీఆర్ చేసిన పాపాల ఫలితాన్ని తెలంగాణ ప్రజలు అనుభవిస్తున్నారన్నారు. ధరణి పోర్టల్‌ను అమెరికా కంపెనీకి అప్పగించి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసగించిందని ఆరోపించారు. భూ సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం 2024 ఆర్ఓఆర్ చట్టం, భూభారతిని తీసుకొచ్చిందన్నారు. భూభారతి చట్ట రూపకర్త భూమి సునీల్ కుమార్ మాట్లాడుతూ.. ధరణి పోర్టల్‌లో సమస్యలు పునరావృతం కాకుండా భూ హక్కులకు హామీ ఇచ్చేలా భూభారతి చట్టం ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భూ సమస్యలపై అధ్యయనం చేసి కొత్త చట్టానికి రూపకల్పన చేశామన్నారు. త్వరలోనే నియమ నిబంధనలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపిందన్నారు. భూములపై రైతులకు హక్కులు కల్పించేలా భూ భారతి చట్టం ఉంటుందన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ధరణి చట్టం అడ్డు పెట్టుకుని ప్రజల హక్కులను కాలరాసిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి, లీఫ్స్ సలహాదారు కరుణాకర్ దేశాయి, రైతు కమిషన్ సభ్యులు భవాని, చెవిటి వెంకన్న, అడిషనల్ కలెక్టర్ రోహిత్‌సింగ్, పాలకుర్తి, తొర్రూరు మార్కెట్ కమిటీ చైర్మన్లు తిరుపతిరెడ్డి, మంజుల, ఆర్డీఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

మినీ జాతరకు నిరంతర విద్యుత్

- ఏర్పాట్లను పరిశీలించిన ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి



ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న వరుణ్‌రెడ్డి

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారం సమ్మక్క సారలమ్మల మినీ జాతరలో నిరంతరం విద్యుత్ సరఫరా అందించనున్నట్లు టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. బుధవారం మేడారం జాతరలో విద్యుత్ సరఫరా ఏర్పాట్ల పరిశీలన కోసం వచ్చిన సందర్భంగా ఆయన సమ్మక్క సారలమ్మలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మినీ జాతరలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరాను అందించాలని అధికారులను ఆదేశించారు. మినీ జాతరకు విద్యుత్ అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, విద్యుత్ లైన్లను సరిచేసే పనుల్లో నిమగ్నమైనట్లు తెలిపారు. ఆయన వెంట నోడల్ ఆఫీసర్ భీకాం సింగ్, భూపాలపల్లి ఎస్ఈ మల్చూర్ నాయక్, ములుగు డీఈ కురసం నాగేశ్వర్‌రావు, డీఈ ఎంఆర్‌టీ సదానందం, సిబ్బంది ఉన్నారు.

పోక్సో కేసులో నేరస్తుడికి 20 ఏళ్ల జైలు

- తీర్పు వెల్లడించిన జడ్జి మనీషా శ్రావణ్ ఉన్నమ్

వరంగల్ లీగల్: బాలికను బెదిరించి లైంగికంగా వాడుకున్న నేరం రుజువుకావడంతో నేరస్తుడు గీసుకొండ మండలం కీర్తినగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ ఎండీ అజీముద్దీన్‌కు 20ఏళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ బుధవారం వరంగల్ పోక్సో కోర్టు జడ్జి మనీషా శ్రావణ్ ఉన్నమ్ తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. జాన్‌పాక్ గ్రామానికి చెందిన ఒంటరి మహిళ తన కుమారుడు, కూతురుతో అద్దె ఇంట్లో ఉంటూ అదే ఇంట్లో ముందుబాగాన హోటల్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుంది. ఈక్రమంలో పాఠశాలకు సెలవులు ఉండటంతో 11 సంవత్సరాల తన కూతురును వెనక రూంలో ఉండి చదువుకోమని చెప్పింది. కీర్తినగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ ఎండీ అజీముద్దీన్ 2021 జనవరి 12న మధ్యాహ్నం బాలిక ఉన్న గదిలోకి వెళ్లాడు. అదేసమయంలో ఆగదిలోకి వెళ్లిన బాలిక తల్లిని చూసిన నిందితుడు పారిపోయాడు. దీంతో 'చెప్పినట్లు వినకపోతే తనతోపాటు అన్నయ్యను చంపుతానని బెదిరించి' లోబర్చుకున్నాడని బాలిక తన తల్లికి వివరించింది. ఇప్పటికే పలుమార్లు తనను శారీరకంగా వాడుకున్నట్లు తెలియజేసింది. దీంతో బాలిక తల్లి ఫిర్యాదు మేరకు గీసుకొండ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు అజీముద్దీన్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. విచారణలో నేరం రుజువుకావడంతో అజీముద్దీన్‌కు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు. బాధితుల పరిహార చెల్లింపు పథకం కింద మైనర్ బాలికకు రూ.3 లక్షలు పరిహారం చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. కేసును పోలీస్ అధికారులు నరేష్‌కుమార్, బి.రాజు, ఎ.మహేందర్ పరిశోధించగా లైజన్ ఆఫీసర్ హరికృష్ణ, భరోసా లీగల్ అడ్వైజర్ నీరజ పర్యవేక్షణలో కానిస్టేబుల్ బొల్లం యుగేందర్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ పక్షాన పబ్లిక్ ప్రాసిక్యూటర్ మర్రి వాసుదేవరెడ్డి కేసును వాదించారు.